## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరిరూరల్: పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు. విద్యుత్ టవర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు టౌన్ ఫీడర్‌ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా పవిత్రా కల్యాణమండపం ఏరియా, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, పామూరు బస్టాండ్ సెంటర్, తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### నిబద్ధతతో పనిచేస్తే తగిన గుర్తింపు



లక్ష్మీ సుజాత సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

పీసీపల్లి: నిబద్ధతతో పనిచేస్తే ఏ రంగంలోనైనా తగిన గుర్తింపు వస్తుందని డ్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సజన అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కందుకూరి లక్ష్మీ సుజాతను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉండేలా మంజుల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లక్ష్మి సుజాతను ఆదర్శంగా తీసుకొని కష్టపడి పని చేయాలని అప్పుడే వృత్తికి తగిన గౌరవం లభిస్తుందన్నారు. ఎంఈఓ శ్రీనివాసచారి ప్రతాప్, సహచర ఉద్యోగులు పాల్గొన్నారు.

### చిల్లచెట్లను తొలగించండి



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం–పాకల మధ్య రహదారిలో రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు పెరగడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిల్లచెట్లు ఏపుగా పెరగటంతో స్కూలు బస్సులు వెళ్లేటప్పుడు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు ఆటోలు, ట్రాక్టర్లలో పొలాలకు వెళ్లేటప్పుడు ముళ్లు తగిలి గాయాలవుతున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### 7న చేపలకు వేలంపాట

లింగసముద్రం: మండలంలోని మేదరమిట్లపాలెం పంచాయతీలో ఉన్న ఊర చెరువులో చేపలు వేసి పెంచుకుని అమ్ముకునేందుకు డిసెంబరు 7వ తేదీ ఉదయం 11 గంటలకు మేదరమిట్లపాలెంలోని రామాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నారు. వేలంపాటలో పాల్గొనదలచినవారు రూ.5000 రుసుం చెల్లించాలని కార్యదర్శి తెలిపారు.


### పందలపాడు వాసికి పీహెచ్‌డీ

కందుకూరు రూరల్: మండలంలోని పందలపాడు గ్రామానికి చెందిన గోచిపాతల ప్రవీణ్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. రూరల్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి ప్రకాశం జిల్లాలోని గిరిజన మహిళల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సుదీర్ఘమైన పరిశోధనలు చేశాడు. దీనికి ప్రవీణ్‌కు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు రీసెర్చ్, డెవలప్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ తెలియజేశారు. పరిశోధనలో ప్రవీణ్‌కు పర్యవేక్షకులుగా ఆచార్య కె.సోమశేఖర్ వ్యవహరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గంగాధర్‌రావు, రిజిస్ట్రార్ సింహాచలం, రెక్టార్ రత్నశీలామణి.. ప్రవీణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. డాక్టరేట్ పట్టా పుచ్చుకున్న ప్రవీణ్‌ను పందలపాడు గ్రామస్తులతోపాటు స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

### తుఫాన్‌పై అప్రమత్తత ఎక్కడ?

ఉలవపాడు: ఫెంగల్ తుఫాన్ గురించి అధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉలవపాడు మండలం తీరప్రాంతంలో ఉంటుంది. నియోజకవర్గంలో మత్స్యకార గ్రామాలు అధికంగా ఉన్న ఈ మండలంలో అధికారులు.. ప్రజలకు కనీసం సమాచారం ఇవ్వడం లేదు. ఓ వైపు వర్షం పడుతున్నా ఒక్క శాఖ అధికారి కూడా పట్టించుకోలేదు. సాధారణంగా రెవెన్యూ అధికారులు తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం, డ్యూటీలు వేయడం, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం చేస్తారు. కానీ ఈ దఫా అప్రమత్తం కూడా చేయలేదు. మత్స్యకారులు.. మీడియా, సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని వేటకు వెళ్లలేదని అంటున్నారు. తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో వర్షం పడుతోంది. స్వల్పంగా గాలులు వీస్తున్నాయి. సముద్రంలో అలలు ఎగిసి పడుతున్నాయి. వర్షం అధికంగా పడితే ఉలవపాడు, మన్నేటికోట లోని గిరిజన కాలనీల్లోకి నీరు వచ్చే పరిస్థితి ఉంటుంది.

# సాగునీటి సమరానికి రెఢీ



కనిగిరి ప్రాంతంలోని సాగు నీటి చెరువులు, కాలువలు



ఇరిగేషన్ కార్యాలయం కనిగిరి

- నియోజకవర్గంలో 53 సాగునీటి సంఘాలు
- సిద్ధమైన ఓటర్ల జాబితా
- ఈ నెల 8,9 తేదీల్లో ఎన్నికలు..
- 53 సాగునీటి సంఘాలకు 22,430 మంది ఓటర్లు

కనిగిరిరూరల్:

సాగు నీటి సంఘాల ఎన్నికల సైరన్ మోగింది. ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు కసరత్తు పూర్తి ఓటర్ల జాబితాలను విడుదల చేశారు. డిసెంబర్ 5న నోటిఫికేషన్, 8,9 తేదిల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1 మీడియం (పామూరు మండలం, మోపాడు) 52 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. 100 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులన్నింటికి సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయి. 53 సాగునీటి సంఘాల్లో 22,430 మంది ఓటర్లు ఉన్నట్లు ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. చెరువులు, కాలువల కింద భూములు సాగుదారులందరికీ ఓటు హక్కు ఉంటుంది. కనీసం సెంటు భూమి ఉన్న రైతుకు కూడా ఓటరుగా ఉంటారు. మూడేళ్ల నీటి తీరువా చెల్లించి ఉండాలి. ఒక్కో సాగునీటి సంఘానికి ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు. వీరిలో ఒకరు అధ్యక్షుడు, మరొకరిని ఉపాధ్యక్షుడి ఎన్నుకుంటారు. చెరువుల నిర్వహణ, అభివృద్ధి, నీటి తీరువా వసూళ్లు, వంటి బాధ్యతలు నీటి సంఘాలకు ఉంటుంది.

**రైతన్న ఆలోచించి ఓటు వేయ్..!**

కూటమి సర్కారు ఏర్పడి దాదాపు ఆరు నెలలు దాటింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మధ్య తేడాను రైతులు ఇప్పటికే గమనించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలబడి భరోసా కల్పించింది. రైతు భరోసా కింద నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు జమ చేసి, వ్యవసాయానికి సాయం చేసింది. కానీ నేటి కూటమి సర్కార్ మేనిఫెస్టోను తొంగలో తొక్కింది. పంటల సాగుకు అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేల వరకు చెల్లిస్తామని చెప్పి చేతులెత్తేసింది. ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమైన చిల్లిగవ్వ విదల్చలేదు. కచ్చితంగా రైతులు గత ప్రభుత్వ పాలనకు, కూటమి సర్కార్ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుని ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

**సాగునీటి ఎన్నికలు జరిగే చెరువులు, ఓటర్ల వివరాలు**

| మండలం | ఇరిగేషన్ చెరువుల సంఖ్య | వాటి పరిధిలోని ఓటర్ల వివరాలు |
|---|---|---|
| కనిగిరి | 13 | 5,891 |
| హెచ్‌ఎంపాడు | 3 | 1,199 |
| పామూరు | 6 మైనర్, 1 మీడియం (మోపాడు) | 6689 |
| సీఎస్‌పురం | 12 | 2,124 |
| వెలిగండ్ల | 8 | 3,124 |
| పీసీపల్లి | 10 | 3,403 |
| మొత్తం | 53 | 22,430 |

## పులి వెంకట రమణారెడ్డికి ఘన నివాళి



రమణారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పులి లక్ష్మీ, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి

కనిగిరిరూరల్: జెడ్పీటీసీల సంఘం మాజీ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ సొసైటీ, కాస్మోపాలిటన్ క్లబ్ మాజీ అధ్యక్షుడు దివంగత పులి వెంకట రమణారెడ్డి వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీవీఆర్ పార్క్‌లోని పులి రమణారెడ్డి విగ్రహానికి రమణారెడ్డి సతీమణి పులిలక్ష్మీ, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాస్మోపాలిట్ క్లబ్ ఆవరణలోని విగ్రహానికి క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పులి రమణారెడ్డి కనిగిరి ప్రాంత అభివృద్ధికి అనేక సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, పి.పద్మ, ఎస్ ఇందిర, సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ దేవకి రాజీవ్, ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, చెక్క బాలకృష్ణారెడ్డి, అంబాల సుబ్బారెడ్డి, పులి నాగేంద్రారెడ్డి, రుద్ర, ఎస్‌కే సందాని, ముత్యాల శ్రీను, జానీ, మన్సూర్, చీమలమర్రి ప్రసాద్, ముక్కంటి, కోటపాటి మనోహర్ పాల్గొన్నారు.

## మట్టి తవ్వకాలు నిలిపివేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రామాపురం గ్రామస్తులు

సీఎస్‌పురం(పామూరు): రోడ్డుపక్కన చేస్తున్న మట్టి తవ్వకాలను తక్షణం నిలిపివేయించాలని కోరుతూ మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన పలువురు రైతుసంఘం నాయకులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లుకు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల కార్యదర్శి ఎం.రత్నారెడ్డి, రామాపురం గ్రామానికి చెందిన గాదంశెట్టి లక్ష్మీనరసయ్యలు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణానికంటూ రామాపురం గ్రామానికి వెళ్లే తారురోడ్డు పక్కనే మట్టి తవ్వకాలు చేపడుతున్నారని దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయన్నారు. వర్షాలు కురిసి గుంతల్లోకి నీరుచేరితే నిత్యం రోడ్డుగుండా సీఎస్‌పురం వైపుకు వెళ్లే విద్యార్థులు అటువైపుకు వెళ్లి ప్రమాదం బారిన పడే అవకాశముందన్నారు. తక్షణం రోడ్డు పక్కన మట్టి తవ్వకాలు నిలిపివేయించి రోడ్డుకు దూరంగా మట్టి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో జయరాములు, గిద్దా బాల గురవయ్య, కొనంకి వెంకట సుబ్బయ్య, బాలకేశవులు, వెంకటాద్రి పలువురు ఉన్నారు.

# పనుల కేటాయింపులో పక్షపాతం చూపించొద్దు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి

సింగరాయకొండ: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కేటాయింపులో గ్రామాల వారీగా అందరికీ న్యాయం చేయాలే తప్ప పక్షపాతం చూపించొద్దని వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందని, గతంలో గుంతలు పూడ్చినా ప్రయోజనం లేదని శాశ్వత పరిష్కారం చూడాలని సూచించారు. దేవదాయ భూముల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించాలని, బింగినపల్లి గ్రామానికి పల్లెపండుగ కార్యక్రమంలో నిధులు కేటాయించలేదన్నారు. గ్రామాల్లో మురుగుకాల్వలు నిర్మించాల్సి ఉందన్నారు. బింగినపల్లి చెరువుకు లాకుల తలుపులు దెబ్బతిని నీరు వృథాగా పోతున్నాయని, తలుపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీపీ కట్టాశోభారాణి మాట్లాడుతూ కనుమళ్ల రోడ్డు నుంచి కనుమళ్ల చెరువుకు వర్షం నీరు సక్రమంగా పారటం లేదని, రోడ్డుపై ప్రవహిస్తున్నాయని, శాశ్వత పరిష్కారానికి నిధులు కేటాయించాలని సూచించారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరి మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి స్థలం కావాలని, రెవెన్యూ అధికారులు సహకరించి స్థలం కేటాయిస్తే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సబ్సిడీ సౌరవిద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని ప్రతి ఒక్కరికి ఈ పథకం క్రింద యూనిట్లు మంజూరు చేస్తామని, దెబ్బతిన్న కరెంటు స్తంభాలు మారుస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ సాంబశివరావు తెలిపారు. మండలంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్ల విషయం మాత్రం ప్రస్తావించలేదు. గృహనిర్మాణశాఖ ఏఈ పృథ్వీ మాట్లాడుతూ సొంత స్థలం ఉన్నవాళ్లకి గృహాలు మంజూరు చేస్తున్నామని, లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశానికి ఇరిగేషన్, ఎక్సైజ్ అధికారులు గైర్హాజరయ్యారు. ఒక్క శానంపూడి సర్పంచ్ తప్ప మిగిలిన సర్పంచ్‌లు హాజరు కాలేదు. ఎంపీటీసీలు కూడా నామమాత్రంగానే వచ్చారు. గ్రామస్థాయి అధికారులు కూడా నామమాత్రంగా హాజరయ్యారు. ఎంపీడీఓ డి.జయమణి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ సర్దార్ పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రం రైతులకు ఎంతో ఉపయోగం



ప్రయోగశాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు

సింగరాయకొండ: విత్తనాలు, ఎరువులు పరీక్షించి వాడటం వల్ల రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు దక్కి అధిక దిగుబడులు రావటానికి అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ జేడీ ఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులోని వైఎస్సార్ విత్తనాలు, ఎరువుల పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న పరీక్షా విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జూనియర్ ఎనలిస్టులు కె.రమణయ్య,, కె.విజయసారథిరావు మాట్లాడుతూ ఈ కేంద్రంలో ఇప్పటివరకు 601 విత్తనాలు, 311 ఎరువుల శాంపిళ్లను పరీక్షించినట్లు పేర్కొన్నారు. తరువాత వరిపొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏడీఏ ఇ నిర్మలకుమారి, ప్రయోగశాల ఏఓ ఎం మాల్యాద్రి, టెక్నికల్ ఏఓ బి. శ్రీనివాసనాయక్, ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎన్ఎంఎస్ మోడల్ టాలెంట్ టెస్ట్

కనిగిరిరూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎస్(నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్) మోడల్ టాలెంట్‌టెస్టును ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, నిర్వాహక కమిటీ జి.సుబ్బారెడ్డి, పి. మాధవరావు, మధు, కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల విద్యార్థులు మోడల్ టెస్టును సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని నిర్వాహక కమిటీ తెలిపారు.

## నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలి



పింఛన్ల పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ



పామూరు: పింఛన్ల పంపిణీ తీరును పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: ప్రతి సచివాలయ పరిధిలో పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు అన్నారు. మండలంలోని దొడ్డిచింతల, హాజీపురం, సీతారాంపురం, కిష్టంపల్లి పంచాయతీలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు. వృద్ధుల పింఛన్ల పంపిణీ సిబ్బంది లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఇవ్వాలన్నారు. మొదటి రోజు నూరు శాతం పంపిణీ చేసేందుకు కృషి చేయాలన్నారు. దొడ్డిచింతల సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, కిష్టంపల్లి సర్పంచ్ ఉడుముల వెంకటయ్య, తదితులున్నారు.

పామూరు: వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ ఏదైనా సరే లబ్ధిదారుల ఇంటివద్దే విధిగా ఇవ్వాలని ఎంపీడీఓ బొల్లినేని సురేష్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పెన్షన్ పంపిణీ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది పెన్షన్ నగదును లబ్ధిదారులకు ఒక ప్రదేశంలో కాకుండా వారి ఇళ్ల వద్దే ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడైనా పెన్షన్ పంపిణీపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎస్సై ఎం మాధవరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టు పెట్టడం నేరమన్నారు. సైబర్ నేరాలపై, మాదక ద్రవ్యాలు, మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాలు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ లక్ష్యాని నిర్దేశించుకోని కష్టపడి చదవాలన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోని ఉన్నత చదువులు చదవాలన్నారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. హెచ్ఎం బ్రహ్మానందరెడ్డి , ఉపాధ్యాయులు కేశవరావు, మాలకొండయ్య తదితరులున్నారు.

## పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



వార్డుల్లో జరుగుతున్న ఫాగింగ్

కనిగిరిరూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి, ప్రధాన రోడ్లల్లోని కాలువల్లో పూడికతీత పనులు చేయించారు. అనంతరం రాత్రికి మున్సిపాలిటీ పరిధిలోని 10,11 వార్డుల్లోని అర్బన్ కాలనీ, కాశీపురంలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.



## షాట్‌పుట్‌లో కదిరి వ్యవసాయ కళాశాల విద్యార్థి సత్తా



శ్రీకాకుళం ఎస్పీ చేతుల మీదుగా కప్ అందుకుంటున్న మునయ్య

సీఎస్‌పురం(పామూరు): శ్రీకాకుళం జిల్లాలోని నైరా వ్యవసాయ కళాశాలలో జరిగిన మూడో విడత అంతర కళాశాలల క్రీడా పోటీల్లో మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. షాట్‌పుట్‌లో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థి మునయ్య సత్తా చాటి ప్రథమస్థానం పొంది విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా శనివారం శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి చేతుల మీదుగా విన్నర్‌కప్ అందుకున్నారు. కళాశాల డీన్, అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# వైభవంగా శివస్వాముల పడిపూజ



శివ స్వాముల పడి పూజ

కనిగిరిరూరల్: పట్టణంలోని దోరువు వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శివ మాలాధారులు పడిపూజ అత్యంత వైభవంగా జరిగింది. శివ నామస్మరణాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. 12 మెట్ల పూజలను అత్యంత నియమ నిష్టలతో నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప, ఆంజనేయ స్వామి మాలాధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే శనివారం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

# వన్యప్రాణులతోనే మనిషి మనుగడ



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వెంకట జానకిరామ్

కందుకూరు రూరల్: వన్యప్రాణులు లేనిదే మనిషికి మనుగడలేదని డిప్యూటీ ఈఓ ఎం.వెంకట జానకిరామ్ అన్నారు. కందుకూరులోని ఎస్ఆర్ఎం చైతన్య స్కూల్‌లో శనివారం జంగిల్ బుక్, జంతువులపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ పిల్లల చేత జంతువుల వేషధారణ వేయించి వాటి జీవన మనుగడ ఎలా ఉంటుందో నూతన పద్ధతిలో తెలియేశారన్నారు. ఎంఈఓలు బి.అజయ్‌బాబు, కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి పిల్లలకు ప్రకృతి, అడవులు, వన్యమృగాలు వాటి మనుగడ గురించిఎంతో ఆకర్షణీయంగా ఒక నూతన పద్ధతిలో భారీ ద్వారాన్ని జంతువుల వేషధారణ ద్వారా తెలియజేయడం ఒక గొప్ప అనుభూతి కలిగించిందన్నారు. ఇలాంటి ఒక నూతన ఆకర్షణీయమైన కార్యక్రమం నిర్వహించిన ఎస్ఆర్ఎం చైతన్య స్కూల్‌యాజమాన్య బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దాదాపు వంద మంది పైగా విద్యార్థులు ప్రదర్శించిన సింహాలు, పులులు, జిరాఫీలు, చిలుకలు, కుందేలు, కంగారు, కోతి, జింకల వేషధారణ ఆకర్షణీయంగా నిలిచాయి.

## గుంతలు పూడ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



టంగుటూరు - కొండపి ఫ్లైఓవర్ కింద పూడ్చిన గుంటలు

టంగుటూరు: 'హైవే అధికారుల నిర్లక్ష్యం' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని కొండపి ఫ్లై ఓవర్ కింద, సమీపంలోని పెద్ద గుంతలను కంకర, తారుతో శనివారం పూడ్చారు. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పాయి.